సాక్షి జగిత్యాల

ఆదివారం । 22 । జనవరి । 2023



అంజన్న సన్నిధిలో రద్దీ

కొండగట్టు: కొండగట్టు అంజన్న సన్నిధిలో శనివారం రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



మైనార్టీ గురుకులం..

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ గురుకులాలను ప్రారంభించింది. ఈ నెల 30లోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/17.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

గడువులోగా కస్టమ్ మిల్లింగ్ పూర్తి చేయండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాలటౌన్: 2021–22 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ కస్టమ్ మిల్లింగ్‌ను ఈనెల 31లోగా పూర్తి చేసి పౌరసరఫరాల శాఖకు అప్పగించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత మిల్లర్లను ఆదేశించారు. శనివారం కస్టమ్ మిల్లింగ్‌పై కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. జిల్లాలో వానాకాలానికి సంబంధించి ఇప్పటివరకు కేవలం 68శాతం మాత్రమే అప్పగించారని, ఇంకా మిగిలి ఉన్న 32శాతం సీఎంఆర్ పూర్తి చేసి గడువులోగా అప్పగించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారితో పాటు జిల్లా మేనేజర్ పాల్గొన్నారు.

రోల్లవాగు పనుల్లో వేగం పెంచాలి



పనులను పరిశీలిస్తున్న ఎస్‌ఈ అశోక్‌కుమార్

సారంగాపూర్(జగిత్యాల): రోల్లవాగు ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచి సాధ్యమైనంత తొందరలో నీటిని విడుదల చేయాలని నీటిపారుదల శాఖ ఎస్‌ఈ అశోక్‌కుమార్ అన్నారు. ప్రాజెక్టు మూడవ కట్ట నిర్మాణ పనులను శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ నారాయణరెడ్డి, డీఈ చక్రునాయక్‌లు ఎస్‌ఈకి వివరణ ఇస్తూ మట్టి సేకరణలో భాగంగా పనులు పూర్తికావడంలో జాప్యానికి కారణమైందన్నారు. పనులను సత్వరమే పూర్తి చేసి నీటి విడుదల చేసే విధంగా చూడాలని ఈఈ, డీఈలను ఎస్‌ఈ ఆదేశించారు.

మంత్రి ఎర్రబెల్లిని కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

జగిత్యాలజోన్: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును శనివారం జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత దంపతులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్‌కు అత్యధికంగా నిధులు కేటాయించాలని కోరారు. మండలాలు, గ్రామపంచాయతీలకు కూడా నిధులు అందజేయాలని కోరారు. ఆమె వెంట భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ హర్షిని ఉన్నారు.

రాష్ట్రస్థాయిలో కళాశాలకు గుర్తింపు తేవాలి



విద్యార్థిని సన్మానిస్తున్న అధికారులు

కోరుట్ల: రాబోయే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి కోరుట్ల జూనియర్ కళాశాలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తేవాలని జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి బి.నారాయణ అన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలో శనివారం క్రీడ, సాంస్కృతిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. గత సంవత్సరం ఇంటర్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన ఎంపీసీ విద్యార్థి డింగరి విక్రమ్‌కు నగదు పురస్కారం అందజేసి సన్మానించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జిందం రాజేష్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ రుణ యూనిట్లు కేటాయించాలని వినతి

మెట్‌పల్లి(కోరుట్ల): మైనార్టీలకు సబ్సిడీపై అందించే రుణాలకు సంబంధించి మరిన్ని యూనిట్లను కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు శనివారం మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. కోరుట్ల నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో మైనార్టీలున్నారని, కానీ కేవలం ఏడు యూనిట్లను మాత్రమే కేటాయించడం జరిగిందన్నారు. స్వయం ఉపాధి కోసం చాలా మంది దరఖాస్తు చేసుకున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని మరిన్ని యూనిట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

గోదావరిఖని(రామగుండం): సిరులవేణి.. మన సింగరేణిలో నవశకం నడుస్తోంది. బొగ్గుగనులపై యువరక్తం ఉరకలేస్తోంది. సింగరేణి ఆవిర్భావం నుంచి తట్టా, చెమ్మాస్ చేతపట్టి బొగ్గుపెల్లలు మోసిన కార్మికులు ఆ బాధ్యతను వారసత్వంగా అందిస్తున్నారు. తెలంగాణ ఆవిర్భావం తరువాత కారుణ్య నియామకాల ద్వారా వేలాది మంది కార్మికులు తమ పిల్లలకు సింగరేణి సంస్థ అభివృద్ధిలో అవకాశం కల్పిస్తున్నారు. డిగ్రీలు, పీజీలు, ఇంజనీరింగ్ చదివిన వాళ్లు సైతం కార్పొరేట్ ఆఫీసుల్లో ఉద్యోగం వదులుకుని గనుల్లోకి దిగుతున్నారు. పురుషులతో సమానంగా యువతులు కూడా సింగరేణి తల్లి ఒడిలో కొలువు చేస్తున్నారు. రామగుండం రీజియన్ పరిధిలో 4వేల మంది వరకు యువత ఉద్యోగం చేస్తుండగా.. సింగరేణి వ్యాప్తంగా 12 వేల మంది కార్మికులు ఉన్నారు. సింగరేణి సంస్థలో యువత పాత్రపై సండే స్పెషల్..!!

నల్లనేలలో 'నవ'తరం

సింగరేణిలో పెరుగుతున్న యువత

Sunday Special



- కారుణ్య నియామకాలతో సంస్థకు కొత్తరక్తం
- భారీగా పెరిగిన యువ, మహిళా కార్మికులు
- ఇప్పటికే 12వేల మార్కు దాటిన యువ ఉద్యోగులు



ఇతని పేరు ఆకుల చందు. హుజూరాబాద్ నివాసి. చందు మామ మెడికల్ ఇన్వాలిడేషన్ కావడంతో అల్లుడిగా సింగరేణిలో ఉద్యోగం లభించింది. మూడేళ్లుగా ఆక్టింగ్ సపోర్ట్‌మెన్‌గా డ్యూటీ చేస్తున్నాడు. 'గనిలోకి వెళ్లి విధులు నిర్వహించడం కొత్త అయినప్పటికీ.. ఇన్ని రోజులు పనిచేసిన అనుభవం, సీనియర్ల సూచనలు సలహాలతో ఉత్సాహంగా ముందుకు సాగుతున్నా' అంటూ చందు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.



ఈమె పల్లికొండ శిరీష. రామగుండం పరిధిలోని లింగాపూర్ గ్రామం. తండ్రి మెడికల్ ఇన్‌వాలిడేషన్ కావడంతో అతడి ఉద్యోగం కారుణ్య నియామకం ద్వారా శిరీషకు వచ్చింది. శిరీష అన్నకు ఉద్యోగం ఉంది. తమ్ముడు చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో నాన్న తనకు సంస్థలో ఉద్యోగం పెట్టించాడని.. మిషన్ వైండింగ్‌సెక్షన్‌లో పనిచేస్తున్నట్లు శిరీష వివరించింది.

కారుణ్య నియామకంతో..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న సింగరేణి సంస్థ రాష్ట్రంలోని గోదావరి పరీవాహకంలో ఏడు జిల్లాల్లో విస్తరించి ఉంది. తెలంగాణ ప్రాంతానికి కొంగుబంగారంగా నిలుస్తున్న సంస్థలో యువ ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ఆవిర్భావం తరువాత కారుణ్య నియామక ప్రక్రియ చేపట్టినప్పటికీ.. కొందరు కోర్టుకు వెళ్లడంతో నిలిచిపోయింది. దీనిపై పూర్తిస్థాయిలో కసరత్తు చేసిన రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా చూసింది. అనారోగ్యం బారినపడిన కార్మికులను మెడికల్ ఇన్‌వాలిడేషన్ ద్వారా ఉద్యోగ విరమణకు అవకాశం కల్పిస్తూ కారుణ్య నియామకాల ద్వారా వారి పిల్లలకు అవకాశం కల్పిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో 2018 మార్చి9 నుంచి కారుణ్య నియామక ప్రక్రియ ప్రారంభమైంది. రెండేళ్ల సర్వీసున్న వారు అనారోగ్య కారణాలతో దిగిపోతే.. వారి పిల్లలకు అవకాశం కల్పిస్తున్నారు. ఇలా సంస్థవ్యాప్తంగా ఇప్పటి వరకు 12 వేల మందికిపైగా యువ కార్మికులు నియామకం అయ్యారు.

ఉన్నతంగా చదివి

సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఇతర రంగాల్లో పనిచేస్తున్న యువత సైతం కారుణ్య నియామకాల ద్వారా సింగరేణిలో పనిచేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఉద్యోగ, ఆరోగ్య భద్రత, నివాసం, కనీస వసతులు, మెరుగైన జీతం ఉండడంతో పోటీపడుతున్నారు. ప్రస్తుతం గనుల్లోకి దిగే యువ కార్మికుల్లో డిగ్రీ, పీజీలు, ఇంజినీరింగ్ చేసినవారు ఉన్నారు. కారుణ్య నిమామకాల్లో కొడుకులు లేనివారు కూతుళ్లకు అవకాశం ఇస్తున్నారు. కూతుళ్లకు సాధ్యం కాని పరిస్థితుల్లో అల్లుళ్లకు బాధ్యత అప్పగిస్తున్నారు.

మహిళా కార్మికులు

సంస్థ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మహిళా ఉద్యోగులకు అవకాశం కల్పిస్తూ సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకోవడంతో సంస్థలో వారి సంఖ్య పెరుగుతోంది. ఇద్దరు ఆడపిల్లలు, ఒక్కరే కూతురున్న కార్మికులు ధైర్యంగా వారి సింగరేణి ఉద్యోగాలను అప్పగిస్తున్నారు. కారుణ్య నియామాకాల పక్రియ వేగవంతం కావడంతో సంస్థలో వయస్సుపైబడిన ఉద్యోగులు సంస్థకు దూరమవుతుండగా, వారి స్థానంలో యువ ఉద్యోగులు సంస్థలో చేరుతున్నారు. దీంతో సంస్థలో యువరక్తం పెరిగింది.



సింగరేణిలో కారుణ్య నియామకాలు(ఫైల్)



సింగరేణి సంస్థలో పనిచేస్తున్న మహిళా కార్మికులు

గిరిజన యువతకు అవకాశం

సింగరేణి ప్రభావిత, నిర్వాసిత ప్రాంతాలకు చెందిన గిరిజన యువకు యాజమాన్యం అవకాశం కల్పించింది. ఒకేదఫాగా వెయ్యి మందికి పైగా నియామకం అయ్యారు. ఎస్టీ బ్యాక్‌లాక్ కింద 665మంది, పీడీఎఫ్ కింద 350మందికి ఉద్యోగాలను కల్పిస్తూ సంస్థ నిర్ణయం తీసుకోవడంతో కొలువుకెక్కారు. అదే విధంగా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా 3,600 మందిని ఎంపిక చేశారు. వీరిలో డాక్టర్లు, మెడికోలు, ఇంజనీర్లు, తదితర విభాగాల్లో పనిచేసేవారు ఉన్నారు.

రామగుండం రీజియన్‌లో యువ ఉద్యోగులు ఇలా..

ఏరియా	పురుషులు	మహిళలు	మొత్తం
ఆర్జీ–1	1,226	68	1,294
ఆర్జీ–2	648	60	708
ఆర్జీ–3,ఏపీఏ	797	43	840



జీవితాన్ని మార్చేసింది

నాన్న మెడికల్ ఇన్‌వాలిడేషన్‌తో వకీల్‌పల్లిగనిలో ఉద్యోగం లభించింది. ఆక్టింగ్ సపోర్ట్‌మెన్, ఆక్టింగ్ కోల్‌కటింగ్ పనులకు వెళ్తున్నా. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన. తప్పనిసరి పరిస్థితుల్లో సింగరేణిలో చేరా. ఉద్యోగ భద్రత, విద్య, వైద్యం, మెరుగైన జీతాలుండటంతో ఇటువైపు దృష్టి సారించా. రాబోయే రోజుల్లో మరింత కష్టపడి పదోన్నతి సాధించాలని ఉంది. – మంచాల కల్యాణ్‌కుమార్, వెన్నంపల్లి, కూనారం



ప్రయివేట్ నుంచి సింగరేణికి

నాన్న ఉద్యోగం నాకు ఇచ్చారు. గతంలో ప్రయివేట్ ఉద్యోగం చేసేదాన్ని. డిగ్రీ చదివిన నాకు ఏరియా వర్క్‌షాప్‌లో పోస్టింగ్‌ఇచ్చారు. ఉద్యోగంలోకి చేరి పదినెలలు అయ్యింది. చాలా సంతోషంగా ఉంది. రాబోయే రోజుల్లో క్లర్క్‌గా పదోన్నతి సాధించాలని ఉంది. ప్రస్తుతం వర్క్‌షాప్‌లో ఫ్యాన్ రిపేరింగ్‌సెక్షన్‌లో పనిచేస్తున్నా. – ఈర్ల కల్పన, గోదావరిఖని



భర్త ఉద్యోగం చేస్తున్న

వృత్తిలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉత్సాహంగా పనిచేస్తున్నాం. భర్త ఉద్యోగాన్ని చేస్తున్నా. ఏరియా వర్క్‌షాప్‌లో స్టార్టర్ వైండింగ్ విభాగంలో జాబ్ చేస్తున్నా. మహిళలతో పాటు పనిచేయడంతో పాటు టైం తెలవకుండా ముందుకు సాగుతున్నాం.

– కంటె సంధ్యారాణి, గంగానగర్

కెపాసిటర్ల బిగింపులో నిర్లక్ష్యం!

- గ్రామాలవారీగా రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- ఆచరణలో అన్నదాతల అలసత్వం

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ బావులకు బిగించిన విద్యుత్ మోటార్లు, విద్యుత్ వోల్టేజీ హెచ్చుతగ్గులను నియంత్రించే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ఉండేందుకు విద్యుత్ సంస్థ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈనేపథ్యంలో ప్రతీ విద్యుత్ మోటార్ వద్ద కెపాసిటర్ బిగించుకోవాలని విద్యుత్ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించే పనిలో పడ్డారు. అయితే విద్యుత్ సిబ్బంది ఎంత చెబుతున్నా రైతులు మాత్రం కెపాసిటర్లు బిగించుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో లైన్ లాస్‌లు పెరిగి, నాణ్యమైన విద్యుత్ అందించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని విద్యుత్ సిబ్బంది పేర్కొంటున్నారు.

జిల్లాలో 1.33 లక్షల విద్యుత్ మోటార్లు

జిల్లాలో వ్యవసాయానికి 1.33 లక్షల విద్యుత్ మోటార్లను వినియోగిస్తున్నారు. అయితే, హై లేదా లో వోల్టేజీతో విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయి. ఒక్కసారి మోటర్ కాలిపోతే రైతుకు కనీసం రూ.3 వేల వరకు ఖర్చు వస్తుంది. అలాగే, ఒకే ట్రాన్స్‌ఫార్మర్‌పై మోతాదుకు మించి విద్యుత్ మోటార్లు ఉంటే, ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడ్ పడి కాలిపోతున్నాయి. ఒక ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే విద్యుత్ సంస్థకు కనీసం రూ.లక్ష వరకు నష్టం వాటిల్లుతుంది. కెపాసిటర్ల బిగింపుపై గ్రామాల వారీగా రైతులతో విద్యుత్ సిబ్బంది సమావేశాలు ఏర్పాటు చేసినా పెద్దగా స్పందించిన దాఖలాలు లేవు. కాగా జిల్లాలోని ఇబ్రహీంపట్నం సెక్షన్ పరిధి ఫకీర్‌కొండాపూర్, మూలరాంపూర్, మెట్‌పల్లి మండలం చింతలపేట రైతులు 100 శాతం కెపాసిటర్లు బిగించుకోవడం విశేషం.



వ్యవసాయ పంప్‌సెట్ వద్ద రైతన్న సాగునీరు అందుతున్నా..



ఫ్యూజ్ బాక్సులో కెపాసిటర్

రైతులకు ఉచిత కరెంట్ ఇస్తుండటంతో సాగునీటిపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. జిల్లాలో 2021–22లో మార్చి వరకు 1,102.66 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగించగా, ప్రస్తుతం 2022–23లో డిసెంబర్ వరకు 703.16 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. ఎస్సారెస్పీ, కుంటలు, చెరువుల ద్వారా పంటలకు సాగునీరు అందుతున్నా విద్యుత్ మోటార్లను వినియోగిస్తున్నారు.

కెపాసిటర్లతో లాభాలు..

కెపాసిటర్లు ప్రధానంగా మోటార్‌కు అవసరమైన విద్యుత్‌ను మాత్రమే పంపిస్తాయి. అవి లేకుంటే విద్యుత్ వృథా అవుతుంది. ఓ వైపు మోటార్లకు సరిపడా వోల్టేజీ లేక తిరగకపోవడం, మరో వైపు అధిక లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోతున్నాయి. దీంతో విద్యుత్ లైన్‌లో లాస్ రావడంతో నాణ్యత తగ్గి లో వోల్టేజీ సమస్యలు వస్తున్నాయి. విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులతో సర్వీస్ వైర్లు కాలిపోవడం, ఫ్యూజు బాక్స్‌లోని స్టార్టర్లు, ఫ్యూజులు పాడవడంతో పాటు ఎల్‌టీ లైన్లు కూడా తెగిపోయి సంస్థకు నష్టం జరుగుతుంది.

రైతులకు అవగాహన

గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి కెపాసిటర్ల బిగింపుపై రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. కెపాసిటర్ బిగించుకోని రైతు ఎకరాకు 2 గంటల్లో నీరు అందిస్తే, బిగించుకున్న రైతు ఎకరాకు గంటలోనే నీరు అందించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఒక కేవీఏఆర్ కెపాసిటర్ మార్కెట్లో రూ.175– రూ.200 వరకు దొరకుతుందని సూచిస్తున్నారు. 3 హెచ్‌పీ మోటార్ వద్ద 1 కేవీఏఆర్, 5 హెచ్‌పీ వద్ద 2 కేవీఏఆర్, 7.5 హెచ్‌పీ వద్ద 3 కేవీఏఆర్ కెపాసిటర్‌లు ఉపయోగిస్తే సరిపోతుందని అవగాహన కల్పిస్తున్నారు.

కెపాసిటర్లు బిగించుకోవాలి



వ్యవసాయ పంపుసెట్ల వద్ద కెపాసిటర్లు బిగించుకోవడం వల్ల రైతులకు, విద్యుత్ సంస్థకు లాభం. జిల్లావ్యాప్తంగా కెపాసిటర్ల బిగింపుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. కెపాసిటర్‌తో విద్యుత్ లాస్‌ను నివారించి, నాణ్యమైన కరెంట్ పొందే అవకాశం ఉంది.

– జి.సత్యనారాయణ, జిల్లా విద్యుత్ శాఖాధికారి

గ్రామాల్లో డీఎల్పీవో విచారణ

కథలాపూర్(వేములవాడ): మండలంలోని దుంపేట, గంభీర్‌పూర్, దూలూర్ గ్రామాల్లో శనివారం డివిజనల్ పంచాయతీ అధికారి శంకర్ పర్యటించారు. దుంపేటలో మల్టిపర్పస్ వర్కర్ గంగారాంను విధుల నుంచి తొలగించిన విషయంలో విచారణ చేపట్టారు. గంభీర్‌పూర్‌లో ఓ నిర్మాణం విషయంలో విచారణ చేశారు. దూలూర్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో గంగాధర్, సర్పంచులు అంబటి లత, పోతు సింధూజ, దయ్య లక్ష్మీనర్సయ్య, కార్యదర్శులు ఉన్నారు.



దుంపేటలో విచారణ చేస్తున్న డీఎల్పీవో శంకర్

ప్రణాళికాబద్ధంగా కంటి వెలుగు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): జిల్లాలో 2వ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నామని జిల్లా వైద్యాధికారి శ్రీధర్ అన్నారు. శనివారం మండలంలోని ఫకీర్‌కొండాపూర్ గ్రామంలో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సందర్శించారు. 3వ రోజు ఎంతమందికి పరీక్షలు నిర్వహించారు, ఎంత మందికి కంటి అద్దాలు ఇచ్చారో సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 ఏళ్లు పై బడిన వారు ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న శిబిరాల్లో కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంటి వెలుగు జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్, సర్పంచ్ గుంటి లక్ష్మి, వైద్యాధికారి రాజేందర్, హెల్త్ ఎడ్యూకేటర్ వెంకటేశం, దేఎస్‌ఎంలు సలీంమున్నిసా, సుప్రియ, రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి సరిత, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కళ్లద్దాలు అందజేస్తున్న డీఎంహెచ్‌వో శ్రీధర్

సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాలరూరల్: రెండో విడత కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో శ్రీధర్ అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లిలో శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట వైద్యులు జైపాల్‌రెడ్డి, ఎంపీవో కందుకూరి రవిబాబు, సర్పంచ్ రజిత తదితరులు ఉన్నారు.

ఏసీడీ చార్జీలు చెల్లించం

- గంభీర్‌పూర్ గ్రామస్తుల నిరసన



గ్రామస్తులకు ఏసీడీ చార్జీల గురించి వివరిస్తున్న ఏఈ భూమేశ్వర్

కథలాపూర్(వేములవాడ): మండలంలోని గంభీర్‌పూర్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించమని గ్రామస్తులు శనివారం నిరసన తెలిపారు. గ్రామానికి విద్యుత్ బిల్లులు వసూలు చేసేందుకు సిబ్బంది రాగా.. ఏసీడీ పేరిట ఇష్టమొచ్చినట్లు బిల్లులు వేశారని గ్రామస్తులు మండిపడ్డారు. బిల్లులు చెల్లించమని సిబ్బందిని వెళ్లిపోవాలని కోరారు. ట్రాన్స్‌కో అంబారిపేట ఏఈ భూమేశ్వర్ మాట్లాడుతూ, ఏసీడీ బిల్లులు డిపాజిట్ మాత్రమేనని సహకరించాలని కోరారు. ఇష్టమొచ్చినట్లు బిల్లులు వేశారని, తాము చెల్లించమని గ్రామస్తులు పేర్కొనడంతో కాసేపు రభసా చోటుచేసుకుంది.ఏసీడీ బిల్లులు చెల్లించమని, విద్యుత్ బిల్లులు మాత్రమే చెల్లిస్తామనడంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఏఈ పేర్కొన్నారు. చివరకు గ్రామస్తులు ఏసీడీ బిల్లులు కాకుండా విద్యుత్ బిల్లులు చెల్లించారు.

క్లుప్తంగా

క్రీడలతో స్నేహాభావం పెంపొందుతుంది

మెట్‌పల్లి(కోరుట్ల): క్రీడలతో స్నేహాభావం పెంపొందుతోందని మెజిస్ట్రేట్ వినీల్‌కుమార్ అన్నారు. ప ట్టణంలోని మినీ స్టేడియంలో న్యాయవాదుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌ను శనివారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపర్చ డమే కాకుండా వ్యక్తుల మధ్య స్నేహాభా వా న్ని పెంపొందించడానికి దోహదపడుతాయన్నా రు. అంతకు ముందు కోర్టులో ఫిబ్రవరి 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ గురించి సమావేశం ఏర్పా టు చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, న్యాయవాదులకు పలు సూచన లు చేశారు. దీనిని కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చొరవ తీసుకోవాలన్నారు.

ఖోఖో పోటీలకు అనూష



కోరుట్లటౌన్: పట్టణంలోని అల్లమయ్యగుట్ట వద్ద గల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న చంద్రగిరి అనూష సౌత్ జోన్ అంతర్ విశ్వ విద్యాలయాల ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డా.గోలి శ్రీలత, ఫిజికల్ డైరెక్టర్ డా.హరిరాం తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలో ఈ నెల 23 నుంచి 26 వరకు జరిగే పోటీల్లో శాతవాహన విశ్వ విద్యాలయం తరపున పాల్గొంటుందని పేర్కొన్నారు.

ఆలయ పరిసరాలు పరిశీలన



రేకుల షెడ్డును పరిశీలిస్తున్న ఈవో, తదితరులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయ పరిసరాలను శనివారం ఈవో వెంకటేష్ పరిశీలించారు. ఆలయం ఎదురుగా ఉన్న షెడ్డు వద్ద పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని శానిటేషన్ ఇన్‌చార్జి సుధాకర్‌కు సూచించారు. ఆయన వెంట ఏఎస్ఐ శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ తదితరులున్నారు. అలాగే పలువురు బీఆర్ఎస్ నాయకులు గంగ్ర సుదీష్‌రావు, సురభి ప్రభాకర్‌రావు తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దూడపై చిరుత దాడి

ఇల్లంతకుంట(మానకొండూరు): జిల్లాలో మళ్లీ చిరుత సంచారం కలకలం రేపింది. అటవీ సమీప గ్రామాల ప్రజలు పొలాల వద్దకు వెళ్లేందుకు జంకుతున్నారు. మండలంలోని జవారిపేటకు చెందిన హన్మండ్ల భీమయ్యకు చెందిన దూడపై చిరుత దాడి చేసి చంపింది. తన పొలం వద్ద రోజు మాదిరిగానే పశువులపాక వద్ద దూడను కట్టేసి రాగా శుక్రవారం రాత్రి దూడను చిరుత దాడి చేసి చంపిందని రైతు భీమయ్య తెలిపాడు. ఏడాదికాలంగా చిరుత ఇదే ఏరియాలో సంచరిస్తోందని, ఫారెస్టు అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదన్నారు. విషయం తెలుసుకున్న ఫారెస్టు సెక్షన్ అధికారి భూలక్ష్మి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

మైనార్టీ గురుకులం.. భవితకు సోపానం

- విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 30లోపు ఆన్‌లైన్‌లో అవకాశం
- అర్హత పరీక్షలో మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు
- ఎంపికైతే ఉచిత విద్యతోపాటు వసతి కల్పన



కరీంనగర్: పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ గురుకులాలను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఉచిత విద్యతోపాటు వసతి కల్పించి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న ఈ విద్యాలయాల్లో ప్రవేశానికి ఈ నెల 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మైనార్టీ విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో విద్యనభ్యసించేందుకు మైనార్టీ గురుకులాలు వరంగా మారాయి. నిష్ణాతులైన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యాబోధన సాగుతోంది. 2023–24 విద్యాసంవత్సరానికి గాను 5 నుంచి 9వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 16 విద్యాలయాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో 16 మైనార్టీ గురుకులాలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 5వ తరగతిలో 80 సీట్లు ఉన్నాయి. అన్ని పాఠశాలల్లో కలిపి 1,280 సీట్లున్నాయి. మిగతా తరగతులకు సీట్ల ఖాళీలను బట్టి ప్రవేశం కల్పిస్తారు. ఈ విద్యాలయాల్లో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతోంది. విశాలమైన తరగతి గదులున్నాయి. విద్యార్థులకు క్రీడలు, యోగాసనాలకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. పదో తరగతి తర్వాత భవిష్యత్తులో ఎంచుకోవాల్సిన కోర్సులపై అవగాహన కల్పిస్తారు.

కరీంనగర్ జిల్లాలో 9 పాఠశాలలు..

కరీంనగర్ జిల్లాలో 9 పాఠశాలలు ఉండగా 5 బాలుర, 4 బాలికలకు చెందినవి. 4 కళాశాలలు కరీంనగర్, జమ్మికుంట, మానకొండూర్, హుజూరాబాద్‌లలో ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 80 చొప్పున 720 సీట్లు భర్తీ చేస్తారు. కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులు, వాటిల్లో 160 సీట్లు ఉన్నాయి.

ముస్లింలకు 51, ఇతరులకు మిగతా సీట్లు..

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశానికి http:///tmreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కో పాఠశాలలో ముస్లింలకు 51, క్రిస్టియన్లకు 5, జైనులు, పార్శీలు, బౌద్ధులు, సిక్కులకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం 60 సీట్లు, ఎస్సీలకు 5, ఎస్టీలకు 3, బీసీలకు 10, ఓసీలకు 2 చొప్పున మొత్తం 20 సీట్లు కేటాయించారు. దరఖాస్తుకు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు అవసరమవుతాయి. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారి వార్షికాదాయం రూ.2 లక్షల లోపు ఉన్నవారు అర్హులు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రతీ విద్యార్థి చదవాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ గురుకులాలను ప్రారంభించింది. వీటిల్లో ఒక్కో విద్యార్థిపై రూ.లక్షలు వెచ్చిస్తున్నాం. నాణ్యమైన భోజనం అందించడంతోపాటు అర్హత గల అధ్యాపకులతో విద్యనందిస్తున్నాం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం మైనార్టీ గురుకులాల పాఠశాలల్లో ప్రిన్సిపాళ్లను సంప్రదించాలి. 99490 64858, 73311 70844 నంబర్లకు ఫోన్ కూడా చేయవచ్చు.

– పులి మధుసూదన్, మైనార్టీ జిల్లా సంక్షేమ శాఖ అధికారి

ఉపాధ్యాయ ప్రమోషన్లలో పదిశాతం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న రాజు

జగిత్యాలరూరల్: త్వరలో నిర్వహించే ఉపాధ్యాయ ప్రమోషన్లలో పదిశాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సునావత్ రాజు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల రిజర్వేషన్లను జీవో నంబర్ 33 ద్వారా 6 నుంచి 10 శాతానికి పెంచుతూ గతంలోనే ఉత్తర్వులు జారీ చేసిందని, దానికి అనుగుణంగా జీవో నంబర్ 130 ద్వారా 1 నుంచి 100 రోస్టర్ పాయింట్లలో ఎస్టీలకు పెంచిన రిజర్వేషన్లకు అనుగుణంగా రోస్టర్ పాయింట్లను మార్చుతూ ఓపెన్ కేటగిరీలో ఉన్న నాలుగు రోస్టర్ పాయింట్లను ఎస్టీలకు కేటాయిస్తూ రిజర్వేషన్ ఆఫ్ రోస్టర్ పాయింట్లను నూతనంగా విడుదల చేసిందని, త్వరలో జరగబోయే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో నూతన రోస్టర్ పాయింట్ల ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఓపెన్ కేటగిరీలోని 15,42,67,92 పాయింట్లను ఎస్టీలకు కేటాయిస్తూ మార్పులు చేసిందని, ఉన్నతాధికారులు సమన్వయంతో జీవోను పరిశీలించి ఎస్టీ ఉపాధ్యాయులకు పెంచిన 10 శాతం రిజర్వేషన్ ప్రకారం ప్రమోషన్లు ఇచ్చేలా కృషి చేయాలన్నారు.

గమ్యం చేరేవరకు విద్యార్థులు శ్రమించాలి



మాట్లాడుతున్న ప్రభాకర్

మల్లాపూర్(కోరుట్ల): విద్యార్థులు గమ్యం చేరేవరకు శ్రమించాలని, రానున్న ఎస్సెస్సీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాంబారి ప్రభాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో నిర్వహించిన పరీక్ష పే చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, హాట్ బాక్స్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పాఠశాల దశలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని శ్రమించాలని సూచించారు. పరీక్షలంటే భయం వీడి ప్రశాంతంగా పాఠ్యాంశాలను చదువుతూ సన్నద్ధం కావాలని, సందేహాలు ఉంటే ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ సుకేందర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు సురభి నవీన్‌కుమార్, మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ గున్నాల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, నాయకులు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం నవీన్‌రెడ్డి, శ్రీశైల మల్లేష్‌యాదవ్, కృష్ణమూర్తి, ఎర్ర రమేష్, ప్రిన్సిపాల్ ఆలీమొద్దీన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం రాయికల్ మండలం ఇటిక్యాల, మూటపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలు నిరుపేదల సంక్షేమాన్ని విస్మరించాయని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు చేస్తున్న మోసాలను నిరుపేదలకు వివరించాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటాయని, బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, రైతులకు రుణమాఫీ, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వంటి వాటిని విస్మరించారన్నారు. ప్రభుత్వాల వైఫల్యాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. సమావేశంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, ఎంపీటీసీ రాధ ఆదిరెడ్డి, నాయకులు మండ రమేశ్, మహిపాల్, మారంపల్లి గంగాధర్, మాణిక్యం, శేఖర్, సందీప్, అంతడుపుల రాజుగౌడ్, ప్రణయ్, కుంచెపు గణేశ్ పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతా నుంచి డబ్బు కాజేసిన వ్యక్తిపై కేసు

మెట్‌పల్లి(కోరుట్ల): ఒకరి బ్యాంకు ఖాతా నుంచి అక్రమంగా డబ్బులు కాజేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్యామ్‌రాజ్ శనివారం తెలిపారు. మండలంలోని మెట్లచిట్టాపూర్‌కు చెందిన మక్కల చిన్న సాయిలు ఆత్మకూర్‌కు చెందిన పుప్పాల సందీప్ వద్ద కొన్ని రోజుల క్రితం రూ.50వేలు అప్పుగా తీసుకున్నాడు. ఇందుకు అతడికి మూడు చెక్కులను గ్యారెంటీ కింద ఇచ్చాడు. వీటిని సందీప్ తన మిత్రుడైన బద్దం అంజిరెడ్డికి ఇవ్వగా, అతడు ఆ చెక్కులతో చిన్న సాయిలు ఖాతాలోని రూ.7.65 లక్షలు డ్రా చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి



గంగారాం(ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): అదృశ్యమైన వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో వెలుగుచూసింది. స్థానికులు, పోలీసుల వివరాలు.. పోచంపాడ్‌కు చెందిన నూతికట్టు గంగారాం(67) కొన్నేళ్ల క్రితం మల్లాపూర్‌కు వలస వచ్చి కూలీ పనులు చేసుకుంటూ స్థానిక దుర్గమ్మకాలనీలో ఒంటరిగా నివసిస్తున్నాడు. ఇతడికి భార్యాపిల్లలు ఎవరూ లేరు. గత సోమవారం నుంచి గంగరాం అదృశ్యమయ్యాడు. దీంతో దుర్గమ్మకాలనీవాసులు వృద్ధుడి బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు పలు ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వృద్ధుడి అదృశ్యం కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులతో పాటు బంధువులు, స్థానికులు గాలింపు చేపట్టగా గంగారం నివాసానికి సమీపంలోని అటవీప్రాంతంలో ఉపాధిహామీ గుంతలో మృతదేహం లభ్యమైంది. మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై నవీన్‌కుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. వృద్ధుడి మృతదేహం గుంతలో పూడ్చిపెట్టినట్లు ఉండడంతో పాటు బాగా కుళ్లిపోవడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



ధర్మపురిలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ, తదితరులు

ధర్మపురి: ధర్మపురి పుణ్యక్షేత్రంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు నూతన సబ్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ సూపరింటెండెంట్ సత్యనారాయణ తెలిపారు. ధర్మపురిలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులను పరిశీలించేందుకు శనివారం సాయంత్రం పట్టణంలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధర్మపురి పుణ్యక్షేత్రానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారని అందుకనుగుణంగా విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా కొత్త సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. నూతన సబ్‌స్టేషన్ కోసం చింతామణి చెరువు పక్కనున్న న్యూ టీటీడీ కల్యాణ మండపం సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వైస్ చైర్మన్ రామన్న, కమిషనర్ రమేష్, డీఈ రాజబ్రహ్మాచారి, ఏడీఈ సిందూర్‌శర్మ, ట్రాన్స్‌కో ఏఈ మనోహర్ తదితరులున్నారు.

దళితరైతులకు 'ఎడ్లబండి'

- పీఎం అజయ్ పథకం కింద కేటాయింపు
- ఫైలట్ ప్రాజెక్టుగా ధర్మపురి నియోజకవర్గం
- జిల్లాలో ధర్మారం మండలానికి 50 యూనిట్లు



ఎడ్లబండి

పెద్దపల్లిరూరల్: దళిత రైతుల కోసం బుల్లక్‌కార్ట్ (ఎడ్లబండి) పథకానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మపురి నియోజకవర్గాన్ని ఫైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. 200 యూనిట్లు కేటాయించి ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. జిల్లాలోని ధర్మారం మండలం ధర్మపురి నియోజకవర్గపరిధిలో ఉండడంతో ఆ మండలానికి 50 యూనిట్లు కేటాయించారు.

రూ.2లక్షలు ఉండాలని ప్రతిపాదించినా

చిన్న, సన్నకారు దళిత రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడేలా కేంద్రం రూపొందించిన పీఎం అజయ్ పథకం కింద ఫైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఎడ్లబండి యూనిట్‌కు రూ.2లక్షలు కేటాయించాలని అధికారవర్గాలు ప్రతిపాదించినట్లు సమాచారం. ఎడ్లబండితో పాటు ఇతర వ్యవసాయ పనిముట్లు అందిస్తే మేలు కలుగుతుందని పేర్కొన్నట్లు తెలిసింది. జతఎడ్లు, బండితో పాటు ఇతర వ్యవసాయ పనిముట్లు కూడా అందిస్తే తమ పనులు పూర్తయ్యాక స్థానికంగా ఉన్న ఇతర రైతులకు అద్దెప్రతిపాదికన పనులు చేసి ఆదాయం గడించొచ్చని సూచించినట్లు అధికారవర్గాల ద్వారా తెలిసింది. అయితే ప్రభుత్వం మాత్రం రూ.లక్షతోనే ఎడ్లబండి మాత్రమే ఇచ్చేలా పథకాన్ని సిద్ధం చేసింది.

పీఎం అజయ్ పథకం కింద

ప్రధానమంత్రి అనుసూచిత్ జాతీయ అభ్యుదయ యోజన (పీఎం అజయ్) పథకం కింద ఎడ్లబండి యూనిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఎడ్లబండి కావాలనుకునేవారు చిన్న, సన్నకారు దళితరైతులై ఉండాలి. రూ.లక్షతో జతఎడ్లు, బండి అందిస్తారు. ఈ పథకానికి ఎంపికైన దళితరైతుకు పీఎం అజయ్ ద్వారా రూ.50వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.30వేలు, లబ్ధిదారుడు తనవాటా రూ.10వేలు చెల్లించి మిగతా రూ.10వేలను బ్యాంకు నుంచి రుణంగా పొందాల్సి ఉంటుంది.

అర్హులైనవారికి అందిస్తాం



ఎడ్లబండ్ల పథకం కోసం నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి అందిస్తాం. పీఎం అజయ్ పథకం ద్వార ఫైలట్ ప్రాజెక్టుగా కేటాయించిన యూనిట్లను పొందాలనుకునే దళితరైతులు తమ వాటాగా రూ.10 వేలు చెల్లించి, మరో రూ.10వేలు బ్యాంకు రుణం పొందాల్సి ఉంటుంది.

– మధుసూదనశర్మ, ఎస్సీకార్పొరేషన్ ఈడీ

జోగాపూర్‌లో రౌడీషీటర్ హత్య

- పాతకక్షల నేపథ్యంలో చంపారని అనుమానం
- పరిశీలించిన వేములవాడ డీఎస్పీ నాగేంద్రాచారి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ నాగేంద్రాచారి



శంకర్(ఫైల్)

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన రౌడీషీటర్ గొల్లపల్లి శంకర్‌గౌడ్ ఉరఫ్ మర్డర్ శంకర్ (45)ను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. పాతకక్షల నేపథ్యంలో హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాలు స్థానికుల కథనం ప్రకారం. జోగాపూర్ బస్టాండ్ సమీపంలో శనివారం రాత్రి నిల్చున్న శంకర్‌గౌడ్‌ను ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వెనుక నుంచి వచ్చి తలపై నరికారు. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. హత్య విషయం తెలియడంతోనే వేములవాడ డీఎస్పీ నాగేంద్రాచారి, చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. హత్యకు గల కారణాలపై విచారణ చేపడుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కోసం సిరిసిల్లలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు భార్యలు, ఐదుగురు పిల్లలు ఉన్నారు. గొడ్డలితో దాడి చేశారా? వేటకొడవళ్లు వాడారా.. అనేది తెలియాల్సి ఉంది. హత్యకు గల కారణాలు తెలియరాలేదు.

ఆటో దగ్ధం

కోనరావుపేట(వేములవాడ): బావుసాయిపేటలోని సయ్యద్ ముజీబ్‌కు చెందిన ఆటోను శనివారం గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారు. బాధితుని కథనం ప్రకారం వివరాలు. కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన సయ్యద్‌ముజీబ్ టాటా ఏస్ వాహనాన్ని నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి ఇంటి సమీపంలో పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో వాహనం నుంచి శబ్దం రావడంతో బయటకు వచ్చి చూడగా కాలిపోవడం గమనించాడు. చుట్టు పక్కలవారిని పిలిచి మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా అప్పటికే వాహనం కాలిపోయింది. కోనరావుపేట పోలీసులు చేరుకుని సంఘటన స్థలం వద్దనే విచారణ చేపట్టారు.

టిప్పర్ ఢీకొని రైతు దుర్మరణం

చిగురుమామిడి(మానకొండూర్): మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన తోట సమ్మయ్య(46) అనే రైతు టిప్పర్ ఢీకొని మృతి చెందాడు. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. సమ్మయ్య శనివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో తన వ్యవసాయ బావి వద్దకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మధ్యమానేరు కుడి కాల్వలో పేరుకుపోయిన మట్టిని తరలిస్తున్న ఓ టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య, బంధువులు రాత్రి 8 గంటల వరకు సమ్మయ్య మృతదేహాన్ని తీయనియకుండా అక్కడే బైఠాయించారు. కాంట్రాక్టర్ వచ్చి తమకు న్యాయం చేసేవరకు కదిలేది లేదన్నారు. ఎస్సై దాస సుధాకర్ సర్దిచెప్పినప్పటికీ వారు వినలేదు. మృతుడికి భార్య తిర్మల, కుమారులు సాయి, రంజిత్ ఉన్నారు. కుమారులు చదువు నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్నట్లు బంధువులు తెలిపారు. ఈ సంఘటనపై తమకు ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై పేర్కొన్నారు.

యువతి ఆత్మహత్య

ముత్తారం(మంథని): మండలంలోని ఓడేడ్ గ్రామానికి చెందిన కట్ల శ్వేత(21) ఆత్మహత్య చేసుకుందని ఎస్సై బేతి రాములు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శ్వేత తల్లిదండ్రులు శనివారం పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి ఆమె ఇంటి దూలానికి ఉరేసుకుంది. తల్లి మందలించడంతోనే ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి రమణాచారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నూకలమర్రిలో ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీలు



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని నూకలమర్రిలో చైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని మండలాల నుంచి కబడ్డీ క్రీడాకారులు హాజరుకావాలని యూత్ క్లబ్ అధ్యక్షుడు రోమాల జగదీశ్వర్, కార్యదర్శి పాత్తూరి జనార్దన్ తెలిపారు. 22, 23 తేదీల్లో రెండు రోజులు పోటీలు జరుగుతాయని, ఇందులో మొదటి బహుమతి రూ.20,116, రెండో బహుమతి రూ.15,116, మూడో బహుమతి రూ.10,116, నాలుగో బహుమతి రూ.5,116 నగదు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్రీడల్లో పాల్గొనే వారికి భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఒకే ఈతలో మూడు దూడలు



సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండల కేంద్రంలో శనివారం రాత్రి ఓ ఆవు మూడు లేగదూడలకు జన్మనిచ్చింది. రైతు గొల్లపల్లి నారాయణకు చెందిన ఆవు మూడు దూడలకు జన్మనివ్వగా ఆరోగ్యంగా ఉన్నాయి. చుట్టుపక్కల వారు వాటిని చూసేందుకు తరలివచ్చారు.